క్లుప్తంగా

నేడు నాగులపాలెంలో గడప గడపకు..

పర్చూరు (చినగంజాం): మండలంలోని నాగులపాలెం గ్రామ సచివాలయం పరిధిలో 19వ తేదీ సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పర్చూరు కార్యాలయం ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ హాజరు కానున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మండల జేసీఎస్ కన్వీనర్‌లు, మండల కన్వీనర్‌లు, గ్రామ సర్పంచ్‌లు, వార్డు మెంబర్‌లు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్‌లు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో 2023–24 విద్యాసంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ ఆదివారం తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రభుత్వం నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీని ప్రవేశపెట్టిందన్నారు. విద్యార్థులు ఈనెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ ఎంపిక, జులై మూడు సీట్లు కేటాయింపులు జరుగుతాయన్నారు. దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ తదితర కోటా కింద స్పెషల్ కేటగిరి సీట్లు భర్తీ కోసం విజయవాడ ఎస్ఎస్ఆర్ కళాశాలలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు రోటరీ ఆధ్వర్యంలో 13 జంటలకు షష్టిపూర్తి

మార్టూరు: మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేడు 60 ఏళ్లు పూర్తి చేసుకున్న 13 జంటలకు షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహించి సన్మానించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొమ్రపాటి కాజారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణ మండపంలో నిర్వహించనున్న కార్యక్రమంలో స్థానికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వీరరాఘవస్వామికి ప్రత్యేక పూజలు

చీరాల అర్బన్: పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో వేంచేసియున్న వేదవల్లి, కనకవల్లి సమేత వీరరాఘవస్వామి దేవస్థానంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని విశేష సుగంధ ద్రవ్యాలతో పూజలు నిర్వహించారు. అమావాస్య స్వామివారికి ఎంతో విశిష్టమైన రోజని, కొన్ని సంవత్సరాల ఒకసారి ఇలాంటి అరుదైన రోజు వస్తుందని అర్చకులు దిట్టకవి వాసుదేవాచార్యులు అన్నారు. తమిళనాడులో వీరరాఘవ స్వామి దేవాలయం ఉందని, మన రాష్ట్రంలో చీరాలలో ఈ దేవాలయం ఉందన్నారు. శారీరక, మానసిక రుగ్మతలుంటే స్వామివారికి అత్యంత ప్రీతికరమైన బెల్లాన్ని సమర్పిస్తే వారి కోరికలన్నీ నెరవేరుతాయన్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు


సీనియర్లను సన్మానిస్తున్న రోటరీ క్లబ్‌సభ్యులు

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఫాదర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సీనియర్లు ఎస్ జ్యోతయ్య, మారం కోటేశ్వరరావు, షేక్ అల్లాభక్షు, యర్రగుంట రాజులయ్యను దుశ్శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు మట్లాడుతూ కనిపించని శక్తి దైవమైతే, కని పెంచే శక్తి తల్లిదండ్రులదన్నారు. అందులో తండ్రిపాత్ర ప్రధానమైనదన్నారు. తండ్రిని గౌరవించడం అందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చిన్న మురళీ కృష్ణ, ట్రెజరర్ టీ శ్రీనివాసరావు, నర్రా శ్రీలక్ష్మీ, జే శివకుమారి, కొల్లా భువనేశ్వరీ, అద్దంకి లెవీ ప్రసాద్, సేక్ మహమ్మద్ రఫీ,చప్పిడి వీరయ్య, చామర్తి గురుశేఖర్, అంజాద్ బాషా పాల్గొన్నారు.

ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా విజయలక్ష్మి


అవార్డు అందుకుంటున్న విజయలక్ష్మి

మార్టూరు: మార్టూరు మండలం బొబ్బేపల్లి తూర్పు ఎస్సీ కాలనీకి చెందిన విప్పర్ల విజయలక్ష్మి ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా శనివారం రాత్రి బాపట్లలో పురస్కారం అందుకుంది. బాపట్ల ఎన్‌జీఓ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా ఏపూరి బ్రదర్ హుడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాపట్ల ఐసీడీఎస్ పీడీ శైలజ, సీడీపీవో ఉమాదేవి నిర్వాహకులు చేతులమీదుగా విజయలక్ష్మి పురస్కారం అందుకున్నారు.



ఇంటి వద్ద రోగులను పరీక్షిస్తున్న ఫ్యామిలీ డాక్టర్లు (ఫైల్)


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు (ఫైల్)

రోగులకు అభయం

- ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దకే వైద్యసేవలు
- పేదలకు అందుతున్న మెరుగైన వైద్యం
- తలుపు తట్టి రోగుల నాడి పట్టుకుంటున్న వైద్యులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

జే.పంగులూరు:

వైద్యం కూడా అభివృద్ధి కోవలోకి వస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రజలకు ప్రాథమిక అవసరాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయడంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో విజయవంతం అయ్యాడు. వైద్యో నారాయణ హరి.. వైద్యులు దైవంతో సమానం. అలాంటి వైద్యులను పేద ప్రజలు ఇంటింటికి ఉచితంగా వైద్యసేవలతో పాటు మందులు అందిస్తోంది ప్రభుత్వం. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి నాణ్యమైన వైద్య సేవలు ఇంటి వద్దకే అందుతున్నాయి. దీనితో దీర్ఘకాలిక రోగులతోపాటు, బాలింతలు, గర్భిణులు వృద్ధులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాడు–నేడుతో పీహెచ్‌సీలకు మహర్దశ..

జే.పంగులూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాడు–నేడు కింద నిధులు వెచ్చించి అన్ని వసతులు ఏర్పాటు చేశారు. గతంలో ఈ కేంద్రంలో గర్భిణులకు డెలివరీ వసతులు ఉండేవి కాదు.

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా మేలో అందించిన వివరాలు..

ఆరోగ్య కేంద్రాలు	13
గ్రామాలు	21
బాలింతలు	43
గర్భిణులు	292
బీపీ రోగులు	1253
క్యాన్సర్ రోగులు	9
బ్రెస్ట్ క్యాన్సర్ రోగులు	5
గర్భసంచి క్యాన్సర్ రోగులు	26
కుష్టువ్యాధి రోగులు	6
షుగర్ రోగులు	964
సాధారణ వ్యాధులు కలిగిన రోగులు	1369
పరీక్షించిన రోగులు	1350


ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పంగులూరు

ప్రస్తుతం వైద్యశాలలో ఇప్పటికే ఆరు సహజ ప్రసవాలు కూడా చేశారు. గతేడాది అక్టోబర్‌లో ఫ్యామిలీ డాక్టర్ సేవలను పైలట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభించింది. సీఎం జగన్ ఏప్రిల్‌లో అధికారికంగా ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రారంభించారు. అందులో భాగంగానే ప్రతి పీహెచ్‌సీలు ఇద్దరు లేక ముగ్గురు వైద్యులను నియమించారు. వైద్యులకు వారికి కేటాయించిన గ్రామాలకు నెలకు రెండుసార్లు వెళ్లి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి పట్టణ కేంద్రాల్లోని ఆస్పత్రులకు పంపుతున్నారు. దాదాపు 67 రకాల రోగాలకు సంబంధించిన మందులు ఆందజేస్తున్నారు.


ఈకింది ఫొటోలోని వృద్ధుడి పేరు జీ బైరాగి. బైట మంజులూరు గ్రామానికి చెందిన ఇతను బీపీ, షుగర్‌తో గత 15 ఏళ్లుగా బాధపడుతున్నాడు. గతంతో మందులు సరిపడక పోవడంతో బయట మందుల దుకాణంలో కొనుక్కునేవాడు. ప్రస్తుత ప్రభుత్వంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పరీక్షలు చేసి సరిపడా మందులు అన్నీ ఇస్తున్నారని ఆనందం వ్యక్తం చేశాడు. దీంతో ఆస్పత్రికి వెళ్లే బాధ తప్పిందని బైరాగి చెప్పాడు. ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.


ఈమె పేరు రాయి సుజనా. పంగులూరు గ్రామానికి చెందిన ఈమెకు గత ఎనిమిదేళ్లుగా రక్తహీనతతో బాధపడుతోంది. గతంలో ప్రతి మూడు నెలలకొకసారి ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు పెట్టి రక్త పరీక్షలు చేయించుకునేది. వైద్య పరీక్షలకు, మందులకుగాను రూ. 3 వేలు వరకు ఖర్చు అయ్యేవి. ప్రస్తుతం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో భాగంగా వైద్యులు, నర్సులు గ్రామానికే వచ్చి ఉచితంగా రక్తపరీక్షలు చేస్తున్నారు. అంతే కాకుండా మంచి మందులు ఉచితంగా అందజేస్తుండడంతో ఎటువంటి డబ్బులు ఖర్చుకావడం లేదని సంతోషం వ్యక్తం చేసింది.

నాణ్యమైన వైద్యసేవలు..


ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా తనతో పాటు మరో వైద్యుడు పీహెచ్‌సీ పరిధిలో కేటాయించిన గ్రామాలకు వెళ్లి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానంతో గ్రామీణులకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందుతాయి.

మల్లికార్జునరావు వైద్యాధికారి, జే పంగులూరు

మానవసేవే మాధవసేవ..


ఫ్యామిలీ డాక్టర్ విధానం వచ్చిన నాటి నుంచి రోగుల ఇంటి వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని, వారికి మంచి వైద్య సేవలు అందించగలుగుతున్నాం. వారి పరిసరాలను బట్టి వారి ఆరోగ్యం ఎలా మెరుగు పరుచుకోవాలో అవగాహన కల్పిస్తున్నాం. ఈ కార్యక్రమం రోగులకు ఎంతో ఉపయోగకమైనది.

డాక్టర్ కే శివచెన్నయ్య, వైద్యాధికారి జే పంగులూరు

సంక్షేమమే లక్ష్యంగా దూసుకెళ్తున్న ప్రభుత్వం


బుక్‌లెట్ అందిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

- శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

మేదరమెట్ల: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ సామాన్యులు ఆర్థికంగా ఎదిగినప్పుడే వారి జీవితాలు బాగుంటాయని నమ్మిన సీఎం జగన్ అందులో భాగంగానే నవరత్నాల వంటి సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్నారని చెప్పారు. గ్రామానికి వచ్చిన కృష్ణచైతన్యను నాయకులు శాలువాలు, పూలమాలలతో ఆహ్వానం పలికారు. ఇంటింటికీ వెళ్లిన చైతన్య ప్రభుత్వం ద్వారా అందతున్న పథకాల గురించి అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ బుక్‌లెట్‌లను గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసన్నకుమారి, సర్పంచ్ లక్ష్మీకుమారి, అధికారులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఉపయోగాలు

అద్దంకి: భూసార పరీక్ష చేయించడం ద్వారా సూక్ష్మ పోషకాల భర్తీతో సాగు ఖర్చు తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కొమ్రపాటి వెంకట కృష్ణ అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో రైతు పొలాల్లో భూసార పరీక్షకోసం నమూనా మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలో మొత్తం 558 శాంపిల్స్ సేకరించనున్నట్లు వెల్లడించారు. ఈ శాంపిల్స్‌ను బాపట్ల మట్టి పరీక్ష కేంద్రానికి పంపి ఫలితాలను రైతులకు తెలియజేస్తామన్నారు. ఫలితాల ఆధారంగా ఏ భూమిలో ఎంత మోతాదులో ఏఏ ఎరువులు ఉన్నాయో, ఎంత మోతాదులో వేస్తే సరిపోతుందో సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. ఈ నమూనా సేకరణ కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ షారోన్‌రోజీ రైతులు పాల్గొన్నారు.


మట్టి నమూనా సేకరిస్తున్న అధికారులు

అన్నివర్గాల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం


సంక్షేమ క్యాలెండర్ బ్రోచర్ అందిస్తున్న వెంకటేష్

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్

వేటపాలెం: అన్ని వర్గాల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు పేర్కొన్నారు. వేటపాలెం మండలం పాపాయిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల దగ్గర పడుతున్న వేళ ప్రతిపక్ష పార్టీల నాయకులు చెప్పే కల్లబొల్లి మాటల నమ్మవద్దన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసిన పార్టీ కేవలం వైఎస్సార్ సీపీ ఒక్కటే అన్నారు. సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం పూర్తిగా అమలు చేశారని గుర్తుచేశారు. రాబోవు ఎన్నికల్లో తిరిగి పార్టీని గెలిపించు కోవడానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఎస్ శర్మ, ఆర్‌బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, చీరాల మున్సిపాల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్ బాబు, అర్బన్‌ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు పులి బుజ్జి, పులి హరికృష్ణ, పులి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పులి వెంకటేశ్వర్లు, బీ నాగరాజు, ఎమ హనుమంతు, ఏ సురేష్, పులి తిరుపతిరావు, ఎస్ పిచ్చియ్య, గౌడ్, ఏ నాగార్జున గవిని శ్రీనివాసరావు, అతిన కృష్ణమూర్తి, కే శివరామయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన చర్చి నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

జే.పంగులూరు: మండల పరిధిలోని ఆరికట్లవారిపాలెం గ్రామంలో ఆదివారం నూతన చర్చి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపీ శాప్ నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చర్చినిర్మాణంలో పాలు పంచుకోవటం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం పాస్టర్ల పార్థనల నడుమ చర్చి నూతన నిర్మాణం శంకుస్థాప చేశారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకటసుబ్బారావు, జిల్లా స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు చిలుకూరి సాంబశివరావు, సర్పంచ్ స్వయంపు సురేష్, మండల బీసీసెల్ అధ్యక్షుడు చక్రవరం భాస్కర్ రాజు, ఎంపీటీసీ సింధూర అజీల్ తదితరులు పాల్గొన్నారు.

40 శాతం రాయితీపై డ్రోన్ల పంపిణీకి సిద్ధం

బల్లికురవ: ప్రభుత్వం వ్యవసాయంలో కూలీల కొరత, ఖర్చులు తగ్గించుకునేందుకు 40 శాతం రాయితీపై డ్రోన్‌లు అందజేస్తుందని కావాల్సిన రైతులు దరఖాస్తు చేయించుకోవాలని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నలుగురు. లేదా ఐదుగురు రైతులు ఒక టీమ్‌గా ఏర్పడి డ్రోన్స్‌పై అవగాహన పెంచుకుంటే వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. అయితే టీమ్‌లో ఒక్కరు మాత్రం ఇంటర్మీడియెట్ చదివి ఉండాలని కుమారి ప్రకటనలో పేర్కొన్నారు.

చేనేతలకు చేదోడుగా ఉంటా..


చేనేత ప్రతినిధులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: చేనేత కార్మికులకు, చేనేత వర్గానికి తాను ఎప్పటికి చేదోడుగా ఉంటూ చేయూతనందిస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. ఆదివారం కోర్టు సమీపంలోని కేఎస్ఆర్ డ్రయింగ్ యూనిట్ ప్రాంగణంలో ఈపూరుపాలెం చేనేత ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. చేనేతలపై తనకు ఎప్పటి నుంచో మంచి సంబంధాలు ఉన్నాయని, వారి సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలానే ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చేనేతల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. తన కుటుంబానికి చేనేతలతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తాము రామకృష్ణాపురంలో కలిసిమెలిసి ఉన్నామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం చేనేతలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తుందని పేర్కొన్నారు. నేతన్న నేస్తం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.24 వేలు ప్రతి ఏటా అందిస్తుందని, ఎవరైనా అర్హులుండి రానివారుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలానే అర్హులైన చేనేతలకు వంద యూనిట్లు లోపు ఉన్నవారికి ఉచితంగా విద్యుత్ అందిస్తుందన్నారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత ప్రతినిధులు గుంజారి వెంకటేశ్వర్లు, ఆకురాతి రామకోటేశ్వరరావు, జి.చెన్నకేశవులు, కూరపాటి నరసింహారావు, కె.వెంకటేశ్వర్లు, జి.శ్రీను, అద్దేపల్లి కృష్ణ, బండారు బాలనాగేశ్వరరావు, పులిమి నాగేశ్వరరావు, ఉప్పల చలపతి, ఆకురాతి వర్మ, గోలి జగదీష్, తోకల అనిల్, గోలి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర పాలన అందిస్తున్న ఘనత బీజేపీదే

బల్లికురవ: కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ సంక్షేమ, అభివృద్ధి పథకాలతో తొమ్మిదేళ్లుగా సుస్థిర పాలన అందిస్తుందని బాపట్ల జిల్లా బీజేపీ మహిళామోర్చా అధ్యక్షురాలు ఆర్. కాశీదేవి అన్నారు. ఆదివారం విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని గుంటుపల్లి చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి అక్కడి కూలీలతో మాట్లాడారు. సుకన్య సమృద్ధి యోజన, బేటి బచావో– బేటీ పడావో, ముద్ర రుణాలు, తల్లీబిడ్డ పోషణ, రైతు భరోసా పెట్టుబడిసాయం, ఉపాధి పనులు, రాష్ట్రానికి అందిస్తున్న సేవలపై పుస్తకాలు పంపిణీ చేశారు. గ్రామాల వారీగా వలసలను నిరోధించేందుకు ఉపాధి హమీ పథకంలో ప్రతి కూలీకి పనులు కల్పిస్తున్నామని, రోజు ఐదు గంటలు తగ్గకుండా పని చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని కాశీదేవి వివరించారు. కార్యక్రమంలో మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.


ఉపాధి కూలీలకు పుస్తకాలు పంపిణీచేస్తున్న కాశీదేవి

మార్టూరు శ్మశానంలో చోరీ

మార్టూరు: కాదేదీ చోరీకి అనర్హం అన్నట్లు దొంగలు శ్మశాన్ని కూడా వదల్లేదు.. మార్టూరులో చోరులు బరితెగిస్తున్నారు. గత శుక్రవారం రాత్రి రాజుగారిపాలెం, బొబ్బేపల్లి గ్రామాల్లో 30 మందికి పైగా రైతులు వ్యవసాయ మోటార్లకు చెందిన రూ 50 వేలు విలువైన వైరు చోరీకి గురైన సంగతి మరువక ముందే శనివారం రాత్రి మార్టూరు హిందూ శ్మశాన వాటికలో దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక బలరాం కాలనీ సమీపంలో హిందూ శ్మశాన వాటిక ఉంది. గ్రామ ఉపసర్పంచ్ కాకోలు రామారావు ఇటీవల కాలంలో గ్రామస్తుల సౌకర్యం కోసం శవ దహన సంస్కారాలకు ఇబ్బంది కలుగ కుండా రూ.80 వేలు తన సొంత నిధులతో ఐరన్ ఫ్రేము ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం పొలం పనుల కోసం వెళుతున్న రైతులు శ్మశానంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్లేట్లను అపహరించిన సంగతి గమనించి ఉప సర్పంచ్ కాకోలు రామారావుకు సమాచారం అందించారు. రామారావు ఫిర్యాదుపై ఎస్సై కమలాకర్ ఘటనా స్థలికి వెళ్లి చోరీ జరిగిన తీరు పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

అద్దంకి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈఘటన ఆదివారం రాత్రి మండలంలోని శింగరకొండలో చోటుచేసుకుంది. శింగరకొండ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఏందేటి దుర్గాప్రసాద్ దేవస్థానంలో పనులు చేసుకుంటు జీవనం సాగిస్తుండేవాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో కొంగలకు వాడే విషంతాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇంటి చుట్టు పక్కలవారు గమనించి 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. అద్దంకి వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.